క్లుప్తంగా

నేడు న్యాయ అవగాహన సదస్సు

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో శనివారం న్యాయ వ్యవస్థ, చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశ రాము శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు జిల్లా కోర్టు జడ్జిలు, న్యాయవాదులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపా. గ్రామ విద్యార్థులు, యువకులు, మేధావులు, రాజకీయ, కుల సంఘాల నేతలు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగుల హక్కులను కాపాడుతాం



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన నర్సింహ ఎన్పీఆర్డీ స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనట్లు శుక్రవారం ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఈ నియామకం జరిగిందన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు వారు సద్వినియోగం చేసుకునే విధంగాని చైతన్యం చేస్తానననరు. నర్సింహ ఎంపికపై మండల దివ్యాంగుల సంఘం నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి శుక్రవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన లక్ష్మణ్ వనపర్తి నుంచి ఈ నెల 7న పట్టణానికి వస్తుండగా సెల్‌పోన్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకొని సెల్‌ఫోన్ ఆచూకీ కనుక్కొని స్వాధీనం చేసుకున్నామన్నారు.

3 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడు తెలిపారు. మామిడిమాడ సమీపంలోని వాగు నుంచి ఉదయం 11:30 గంటల సమయంలో గ్రామానికి చెందిన జాఫర్, శ్రీశైలం, కుమ్మరి శాంతయ్య ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వానంగా కోర్టు రోడ్డు



ఆత్మకూర్: పట్టణంలోని జూనియర్ సివిల్‌కోర్టుకు వెళ్లే రహదారి బురదమయంగా మారి అధ్వాన్నంగా తయారయింది. చినుకు పడితే చాలు రోడ్డు చిత్తడిగా మారుతుండడంతో కాలనీవాసులతో పాటు కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత పురపాలకవర్గం, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రముఖ న్యాయవాది ముక్తేశ్వర్ కోరారు.

విద్యార్థికి సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లికి చెందిన విద్యార్థి ఎండీ అప్సర్ నీట్ ఫలితాల్లో 588 మార్కులతో ఉత్తమ ర్యాంక్ రావడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా దౌదర్‌పల్లి గ్రామస్తులు విద్యార్థి అప్సర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ఆర్ జగదీష్, నాగరాజు, నర్సింహులు, హన్మంతు, బాబు, హరికృష్ణ, సల్మాన్ తదితరులు ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

శాంతినగర్: పొలాల్లో విత్తనాలు నాటు వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈఓ భరతసింహ రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో రైతులకు మొక్కజొన్న, వేరుశనగ, పప్పుశనగ పంటల సాగులో మెలకువలు, విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అంతేగాక విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పాన్‌గల్ మండలం మాందాపూర్‌లో ట్యాంకులోని నీటిని పరిశీలిస్తున్న అధికారులు



అమరచింతలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్ నదీం

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ పోషన్న ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపల్‌కు ప్రజలు సహకరించాలని చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగు నీటి కుళాయిల వద్ద పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. ఈమేరకు ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ మురుగుకాల్వలలో దోమలు నివారణ మందులను పిచికారీ చేయాలని సూచించారు.

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రాఘవ అన్నారు. మండలంలోని నాచహల్లిలో ఆయన పర్యటించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో నీరు నిలిచిన ప్రదేశాల్లో బ్లీచింగ్ పిచికారీ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, కార్యదర్శి నూతన్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో రోగాలు

పాన్‌గల్: కాలనీల్లో నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయని, నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు శాగాపూర్, కేతేపల్లి, వెంగళాయిపల్లి, రేమద్దుల, మాందాపూర్, దావాజిపల్లి, అన్నారం, అన్నారంతండా, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యాధికారి తారశశాంక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



నాచహల్లిలో..



శాగాపూర్‌లో..

కొత్త చట్టాలపై అవగాహనకే పరిజ్ఞాన పరీక్షలు



సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఐ

కొత్తకోట రూరల్: ప్రతి పోలీసు అధికారికి చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండే విధంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశానుసారం శుక్రవారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందికి పరిజ్ఞాన పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా సిబ్బంది కేసుల పరిశోధన ఎలా చేయాలి, కేసు వివరాల నమోదు, క్షేత్ర స్థాయిలో కేసుకు సంబంధించిన ఆధారాలు ఎలా రాబట్టాలి అనే అంశాలపై పరిజ్ఞాన సామర్థ్యాన్ని తెలుసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కొత్త చట్టాలపై అవగాహన, కేసుల పరిశోధన గురించి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) వంటి కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగే విధంగా ప్రతి అధికారిని తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఐఫ్టూ సభను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదలచేస్తున్న నాయకులు

ఆత్మకూర్: కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, కార్మికులందరూ ఏకమై హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర నాయకుడు హన్మంతు అన్నారు. శుక్రవారం బాలకిష్టాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలలో కాంట్రాక్టు వర్కర్లతో కలిసి ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం టీయూసీఐలో విలీన సభ పోస్టర్లను విడుదల చేశారు. హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలు ఏకమై ఒక్కటిగా పోరాడుతున్నాయన్నారు. ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగే విలీన సభకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

బీజేపీ బలోపేతానికి కృషి



నియామకపత్రం అందుకుంటున్న గోపి

ఖిల్లాఘనపురం: బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన కొరిగెల గోపి ముదిరాజ్‌ను నియమించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. అందరి ఆమోదంతో పార్టీ కోసం పని చేస్తున్న గోపిని యువమోర్చా అధ్యక్షుడిగా ఎంపిక చేయడంతో పాటుగా నియామక పత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా గోపి ముదిరాజ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మండల యువమోర్చా అధ్యక్షుడిగా నియమించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో విక్రం, ఆశన్న, శివశంకర్, వెంకటరమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సీఎం కప్ కరాటే సెలక్షన్ పోటీల్లో ఆత్మకూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అరవింద్ ప్రతిభను కనబర్చాడు. శుక్రవారం వనపర్తిలో జరిగిన అండర్ 14 విభాగంలో అరవింద్ ప్రతిభను కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని కరాటే మాస్టర్ నరేందర్ తెలిపారు. ఈసందర్భంగా అరవింద్‌ను కరాటే మాస్టర్లు సురేందర్‌రెడ్డి, విజయ్, శేఖర్, నరేందర్‌జీ అభినందించారు.

క్రీడాప్రాంగణం సూచిక బోర్డు తొలగింపు



పత్తిచేను వద్ద బోర్డు తొలగించిన దృశ్యం

అమరచింత: మండలంలోని మస్తీపురంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పత్తి చేను సాగు చేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిందని ఈనెల 15 న సాక్షి దినపత్రికలో 'లక్ష్యం..నిర్లక్ష్యం' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మస్తీపురం గ్రామంలోని క్రీడా ప్రాంగణానికి సంబంధించిన సూచిక బోర్డును అక్కడి నుంచి తొలగించి ప్రభుత్వ పాఠశాల ముందు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థల వివాదం కారణంగా సూచిక బోర్డును తాత్కాలికంగా అక్కడి నుంచి తొలగించామన్నారు.



పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

ముళ్లపొదల తొలగింపు



మస్తీపురం క్రాస్ రోడ్‌లో ముళ్ల పొదలను తొలగిస్తున్న ఎస్ఐ సురేష్

అమరచింత: మండలంలోని మస్తీపురం క్రాస్ రోడ్‌లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను ఎస్ఐ సురేష్ జేసీబీతో శుక్రవారం తొలగించారు. మస్తీపురం క్రాస్ రోడ్ మలుపు వద్ద ముళ్ల పొదలు పెరగడంతో మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులకు మస్తీపురం నుంచి వస్తున్న వాహనాలు కలిపించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ తెలిపారు. ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశ్యంతో పోలీసు సిబ్బందితో కలిసి ముళ్లపొదలను తొలగించినట్లు పేర్కొన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు

'అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరు'



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

గద్వాల అర్బన్: అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రైతుబంధు, రైతు రుణమాఫీని అమలు చేయాలని విషయంపై వినతిపత్రం ఇవ్వడానికి బయలుదేరిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, రంగస్వామి, మునెప్ప తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు ప్రయత్నించాలి



మాట్లాడుతున్న ఉత్తరయ్య

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చిట్యాల శివారులోని చేయూత అనాథ ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి ఈ దేశానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని సూచించారు. లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలకు చదువు తప్పనిసరి అని, బాల్య కార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రేణుక, శోభారాణి, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



గోప్లాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి

పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోప్లాపూర్, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులు అందుబాటులో ఉంటూ తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సత్యనారాయణ, వీఏ బాలీశ్వర, పశువైద్య సిబ్బంది బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

అమ్మాయిపల్లిలో వైద్య శిబిరం



ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లిలో చాలా మంది వివిధ రోగాల బారిన పడుతున్నారని వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సిటిజన్ కౌన్సిల్ ఫర్ రైట్ సంస్థ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి చారకొండ బాబు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ విజయచంద్రమోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ వంటి రోగాల గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధుల గురించి ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, ప్రత్యేకధికారి రఘునాథ్‌రెడ్డి, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చిట్యాల పాఠశాలలో ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం



ట్రోఫీ అందుకుంటున్న ఆత్మకూర్ వాలీబాల్ జట్టు

ఆత్మకూర్: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ 14 వాలీబాల్ పోటీల్లో శుక్రవారం ఆత్మకూర్‌కు చెందిన బాలికల జట్టు జిల్లా ప్రథమ బహుమతి సాధించారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ అండర్ 14 వాలీబాల్ జట్టుకు ఆత్మకూర్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కావ్య, చంద్రిక, పూజిత, సహస్ర, బిందు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతి విద్యార్థిని దివ్య ఎంపికయ్యింది. ఉమ్మడి జిల్లాకు ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టులో పాల్గొంటారని కోచ్ ఖాదర్ తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ కొండాపురం బాలరాజు, ఫిజికల్ డైరెక్టర్లు సంతోషి, వెంకటేశ్వర్లు, కోచ్ ఖాదర్, స్థానికులు విద్యార్థులను అభినందించారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వేణు, కార్తీక్, భవ్య ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం గణేష్‌కుమార్ తెలిపారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో బాలుర పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలో బాలుర జట్టులో వేణు, కార్తీక్, బాలికల జట్టులో భవ్య ప్రతిభ కనభరిచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పెబ్బేరు పోలీసులు

వనపర్తి రూరల్: ఎర్రవల్లి చౌరస్తా నుంచి బాలుడు పృథ్వీక్ బస్సు ఎక్కి పెబ్బేరు బస్టాండ్‌లో దిగాడు. బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతున్న బాలుడిని చూసిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలను సేకరించారు. గట్టు మండలంలోని బొయ్యగూడెం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్‌శెట్టి, రమాదేవి దంపతుల కుమారుడి అని తెలుసుకొని సమాచారం అందించారు. వారు వెంటనే పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌కు రాగా.. పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కుతుబ్

ఆత్మకూర్: పెండింగ్‌లో ఉన్న బోధన ఫీజులు, ఉపకార వేతనాలను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2021 నుంచి 2024 వరకు మూడేళ్ల బకాయిలు రూ.7,700 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అమల్లోకి వచ్చిన ఈ పథకానికి గత పాలకులు తూట్లు పొడిచారని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. బోధన ఫీజులు చెల్లించకపోవడంతో యాజమన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శేఖర్, రవికుమార్, వసీం తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: ఓయూలో అక్టోబర్ 21న జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ వసతి గృహం ఎదుట పీడీఎస్‌యూ ప్రతినిధులు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానమే లక్ష్యంగా, విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రగతిశీల ఉద్యమాల్లో భాగంగా ఎందరో విద్యార్థులు, నాయకులు హక్కుల సాధన కోసం తమ ప్రాణాలను అర్పించారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యావిధానం అశాస్త్రీయ భావజాలానికి పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో రాము, ఆంజనేయులు, సురేందర్, సునీల్, వెంకటేష్, గోపాల్, ప్రశాంత్, బాలరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.